ప్రచురణార్థమైన

## భారతదేశ సర్వోన్నత న్యాయస్థానము

## క్రిమినల్ అప్పిల్లెట్ జూరిస్డిక్షన్

## క్రిమినల్ అప్పీల్ నెం. 1148/2023

## [స్పెషల్ లీవ్ పిటిషన్ (క్రిమినల్) నెం. 295/2023 నుండి ఉత్పన్నమైన వాజ్యము]

| | |
|---|---|
| కేంద్ర దర్యాప్తు సంస్థ | ... అప్పీలుదారు |

వర్సెస్

| | |
|---|---|
| సంతోష్ కర్నాని మరియు ఇంకొకరు. | ... ప్రతివాదులు |

**మరియు**

## క్రిమినల్ అప్పీల్ నెం. 1149/2023

## [స్పెషల్ లీవ్ పిటిషన్ (క్రిమినల్) నెం. 724/2023 నుండి ఉత్పన్నమైన వాజ్యము ]

| | |
|---|---|
| రూపేష్ బల్వంత్ భాయ్ బ్రహ్మభట్ | ... అప్పీలుదారు |

వర్సెస్

| | |
|---|---|
| సంతోష్ కర్నాని మరియు ఇంకొకరు. | ... ప్రతివాదులు |

## తీర్పు

**గౌ॥ న్యాయమూర్తి, సూర్య కాంత్.**

1. అనుమతి మంజూరు చేయబడింది.

2. ప్రస్తుత రెండు అప్పీల్లలోను క్రమానుసారంగా అప్పీలు దారులైన కేంద్ర దర్యాప్తు సంస్థ మరియు రూపేష్ బల్వంత్ భాయ్ బ్రహ్మభట్ (ఇక పై "ఫిర్యాదుదారులు") ఇరువురూ , మొదటి ప్రతివాది , గాంధీనగర్ జిల్లా లోని సిబిఐ/ఎసిబి/గాంధీనగర్ పోలీస్ స్టేషన్ వారు తన పై 2018 లో సవరించిన అవినీతి నిరోధక చట్టము, 1988 లోని సెక్షన్ 7 కింద సి.**ఆర్.నెం.**RC0292022A0011 గా నమోదు చేయబడిన ఎఫ్.ఐ.ఆర్ కు సంబంధించి దాఖలు చేసిన ముందస్తు జామీను దరఖాస్తు ను ఆమోదిస్తూ 19-12-2022 న అహ్మదాబాద్ లోని గుజరాత్ హై కోర్ట్ వారు వెలువరించిన ఉత్తర్వు వలన వ్యధితులు.

**నేపథ్యం**

3. ఫిర్యాదుదారుడు, సఫల్ కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరు పై నిర్మాణ వ్యాపారం చేస్తున్న వ్యాపారవేత్త. ఆదాయపు పన్ను అదనపు కమిషనర్ గా నియమితులైన ఐఆర్ఎస్ అధికారి అయిన మొదటి ప్రతివాది, 2019 ఫిబ్రవరిలో 2018-19 ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయపు పన్ను చట్టం, 1961 లోని సెక్షన్ 133ఎ కింద సఫల్ కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పై సర్వేను నిర్వహించారు, అట్టి సర్వే ద్వారా ఈ సంస్థ కి సంబందించి 50 కోట్ల అప్రకటిత ఆదాయం ఉన్నట్లు గా గుర్తించడం జరిగింది.

4. దాని మీదట, 2021 సెప్టెంబరు నెలలో, అహ్మదాబాద్లోని ఆదాయపు పన్ను శాఖ యొక్క దర్యాప్తు విభాగం సఫల్ కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు వ్యతిరేకంగా శోధన మరియు స్వాధీన చర్యలను ప్రారంభించింది. ఈ శోధనల సందర్భంగా, సెంట్రల్ సర్కిల్, రేంజ్ 1 వ విభాగం వారు ఫిర్యాదుదారుడి వ్యాపారానికి సంబంధించిన కొన్ని పత్రాలను స్వాధీనం పరుచునేందుకు డిమాండ్ నోటీసును ఇచ్చే ప్రక్రియను ప్రారంభించినారు. మొదటి ప్రతివాది ఈ కేసును దర్యాప్తు చేస్తున్నాడని , మదింపు మెమోను సిద్ధం చేస్తున్నాడని ఫిర్యాదుదారుడు కనుగొనడం జరిగింది. దీనికి సంబంధించి, ఫిర్యాదుదారు మరియు మొదటి ప్రతివాది తరచుగా కలుసుకున్నారు. ఈ చర్యల సమయంలో,

మొదటి ప్రతివాది ఫిర్యాదుదారు యొక్క వ్యాపారాన్ని నాశనం చేస్తానని బెదిరించాడని మరియు చట్టవిరుద్ధమైన ప్రతిఫలాలను డిమాండ్ చేసినారని ఆరోపించబడింది.

5. 29 సెప్టెంబర్, 2022 న, మొదటి ప్రతివాది, ఫిర్యాదుదారుని సంప్రదించి, 3 అక్టోబర్, 2022 న తనను కలవాలని చెప్పినారు. తదనుగుణంగా, ఫిర్యాదుదారుడు ఆదాయపు పన్ను కార్యాలయంలో మొదటి 1 ప్రతివాది ని కలిశారు, అప్పుడు మొదటి ప్రతివాది ఫిర్యాదుదారుడి తో అతని కేసులో సహాయం చేయడానికి 30 లక్షల రూపాయలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినారు. ఈ సంభాషణను ఫిర్యాదుదారు డిజిటల్ వాయిస్ రికార్డర్లో రికార్డ్ చేసి, దీనిని దర్యాప్తు అధికారులకు ఇచ్చినారు. మరియు ఈ సంబాషణ వ్రాత ప్రతి ని కూడా కోర్టుకు అప్పగించినారు. ఈ సొమ్ము మొత్తాన్ని ధారా అంగడియా సంస్థలో వర్ధమాన్ అనే వ్యక్తి ఖాతాలో జమ చేయాలని ఫిర్యాదుదారుని ఆదేశించడం జరిగింది.

6. మరుసటి రోజు ఉదయం 7 గంటల 15 ని" కు ఫిర్యాదుదారుడు అహ్మదాబాద్ నగరంలోని ఎసిబి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. దాని మీదట ఎ.సి.బి వారు ఒక వ్యూహం పన్నినారు. ఎసిబి ట్రాప్ టీమ్ సిబ్బందితో పాటు ఫిర్యాదుదారు ని సిబ్బంది ఒకరితో అంగడియా సంస్థకు 30 లక్షల రూపాయల లంచపు డబ్బు పంపడం జరిగింది. ఆ డబ్బు ను అంగడియా సంస్థలో జమ చేసిన తర్వాత ఫిర్యాదుదారుడు మొదటి ప్రతివాదిని వాట్సప్ కాల్ ద్వారా సంప్రదించినారు మరియు ఈ కాల్ ని ఎసిబి బృందం రికార్డ్ చేసినారు. ఇందులో మొదటి ప్రతివాది ఈ డబ్బు చెల్లింపును అంగీకరించినారు. వెంటనే, ఎసిబి బృందం వారు మొదటి ప్రతివాది ని అదుపులోకి తీసుకొని అరెస్టు చేయడానికి వెళ్ళినారు. అప్పుడు మొదటి ప్రతివాది కొంతమంది తన సిబ్బందితో కలిసి ఎసిబి బృందంపై శారీరకంగా దాడి చేసి, ఈ గందరగోళంలో కార్యాలయం నుండి తప్పించుకున్నట్లుగాను ఆ తప్పించుకు పోతున్నప్పుడు తన మొబైల్ ఫోన్ను సహోద్యోగికి అప్పగించాడని ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో, మరో ఎసిబి బృందం ధారా అంగడియాలో జమ చేసిన లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగింది.

7. 2022 అక్టోబరు 4, న అవినీతి నిరోధక చట్టము, 1988లోని 7, 13 (1) మరియు 13 (2) సెక్షన్ల కింద మొదటి ప్రతివాది పై ఎఫ్ఐఆర్ నెం. 12/2022 నమోదు చేయడం జరిగింది.

8. ఈ కేసు యొక్క తీవ్రతను బట్టి , దీనిని 12 అక్టోబర్, 2022 న, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కు (ఇకపై, "సిబిఐ") బదిలీ చేయడము దాని మీదట ఆదే రోజు ఎఫ్ఐఆర్ నెం. 12/2022 ను అవినీతి నిరోధక చట్టము, 1988 లోని సెక్షన్ 7 కింద సి. ఆర్.నెం. RC0292022A0011 గా తిరిగి నమోదు చేయడము జరిగింది. ఈ రికార్డులల్లో ఎఫ్ఐఆర్ తిరిగి నమోదు చేసే సమయానికి మొదటి ప్రతివాది ఎసిబి బృందం అరెస్టును తప్పించుకున్నాడని, ఇంకా పరారీలో ఉన్నాడని చెప్పబడి ఉన్నది.

9. దాని మీదట , మొదటి ప్రతివాదికి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (ఇకపై, "సిఆర్పిసి") సెక్షన్ 41ఎ, కింద నోటీసు జారీ చేయబడింది, అయితే ఆ నోటీసు కు మొదటి ప్రతివాది స్పందించలేదు పైగా 2022, అక్టోబరు 17న, మొదటి ప్రతివాది, తనపై వచ్చిన ఆరోపణలు కారణంగా తీవ్ర ఆందోళన మరియు మానసిక వ్యాకులతకు గురయ్యానని, అందుకు గాను వైద్య చికిత్స కోసం తన సొంత రాష్ట్రమైన రాజస్తాన్ కు వెళ్లానని దర్యాప్తు అధికారికి లేఖ రాసి అందులో విచారణకు హాజరు కావడానికి నాలుగు రోజుల సమయం కావాలని కోరినారు.

10. దర్యాప్తు సమయంలో ధారా అంగడియా సంస్థ యజమాని అయిన స్మిత్ ఠక్కర్, మాలవ్ అజిత్ భాయ్ మెహతా అనే వ్యక్తి ఖాతాలో అక్రమ ప్రతిఫల సొమ్ము నగదు జమ చేసినట్లు అధికారులుకు తెలియజేశారు. ఈ మొత్తాన్ని డిపాజిట్ చేయడానికి ముందు, మాలవ్ మెహతా తో స్మిత్ ఠక్కర్కు తన ఖాతాలో రూ. 30 లక్షల జమ చేయబడతాయి అని అదే రోజున ఆ సొమ్ము ను మరొక వ్యక్తికి బదిలీ చేయవలసి ఉంటుందని కూడా తెలిపినారు.

11. సెక్షన్ 41ఎ కింద ఇంకొక నోటీసు కూడా మొదటి ప్రతివాది కి ఇవ్వడం జరిగింది , అయినా అతను సిబిఐ ముందు హాజరు కాలేదు. కానీ 26 అక్టోబర్, 2022 న, అతను దర్యాప్తు అధికారి కి జైపూర్లోని బ్లూ హెవెన్ హోటల్ యొక్క ఇమెయిల్ ఐడి నుండి ఒక వారం రోజుల సమయం కోరుతూ సమాచారం పంపడం జరిగింది. తదనంతరం, సెక్షన్ 41ఎ క్రింద మరికొన్ని నోటీసులు మొదటి ప్రతివాదికి పంపించడం జరిగినది. వివిధ కారణాలు చూపుతూ మొదటి ప్రతివాది దర్యాప్తు అధికారి ముందు రావడానికి సమయం అడగడం జరిగినది. అదే సమయంలో ముందస్తు జామీను మంజూరు కోసం ఆయన దరఖాస్తు చేయడం జరిగింది.

12. 3వ నవంబర్, 2022 నాటి ఉత్తర్వు ద్వారా, అహ్మదాబాద్లోని సిటీ సివిల్ & సెషన్స్ కోర్టు ముందస్తు జామీను కోసం మొదటి ప్రతివాది చేసిన దరఖాస్తును తిరస్కరించింది. దరఖాస్తు లో

పేర్కొన్న అనారోగ్యానికి సంబంధించి దరఖాస్తు దారు యొక్క న్యాయవాది ఏ విధమైన ఆధారము చూపలేదు. దర్యాప్తు సంస్థకు సహకరించే బదులు దరఖాస్తుదారు పరారీలో ఉన్నాడని మరియు చట్ట ప్రక్రియ నుండి తప్పించుకోవడానికి తన స్వస్థలమైన రాజస్థాన్ లోని ఆసుపత్రిలో చేరినాడని ఈ న్యాయస్థానమునకు స్పష్టమైన అవగాహన కలిగినది. ప్రత్యేక న్యాయమూర్తి, సిబిఐ కోర్టు చేసిన కొన్ని పరిశీలనలు ఈ క్రింది విధంగా ఉన్నాయిః

> " పైన పేర్కొన్న వాస్తవాలు మరియు పరిస్థితుల దృష్ట్యా, పెద్ద కుట్రను వెలికి తీయడానికి ప్రస్తుత దరఖాస్తుదారుని నిర్బంధపు విచారణ తప్పనిసరి అని ఈ కోర్టునకు స్పష్టమైన అభిప్రాయం కలిగినది. ఈ భారీ కుట్రకు పాల్పడడంలో దరఖాస్తుదారు అనుసరించిన కార్యాచరణ విధానాన్ని బహిర్గతం చేయడం చాలా అవసరం మరియు తగిన విచారణ చేయకుండా, సంబంధిత సాక్ష్యములను సేకరించడం అసాధ్యం ఫలితంగా ధర్యాప్తు అసంపూర్ణంగా మిగిలి పోతుంది. అరెస్టును నిరోధించే ఉద్దేశ్యంతో దరఖాస్తుదారు ప్రస్తుత దరఖాస్తును దాఖలు చేశారని, అందువల్ల, దర్యాప్తుకు సహకరించే బదులు దానిని అడ్డుకోవడానికి ప్రయత్నించారని తేటతెల్లమవుతుంది , ఈ కారణాల వలన , దరఖాస్తుదారు దర్యాప్తుకు సహకరించడం లేదని చెప్పవచ్చు.
>
> --- --- ---
>
> ఈ కేసులో దర్యాప్తు ఇంకా పురోగతిలో ఉందని, ఇలాంటి దశలో దరఖాస్తుదారుని విడుదల చేయడం అనేది దరఖాస్తుదారు దర్యాప్తును ప్రభావితం చేయడానికి, సాక్షులను నిరోధించడానికి , సాక్ష్యాలను తారుమారు చేయడానికి కూడా మార్గం సుగమం చేస్తుందనే వాస్తవాన్ని కూడా ఏ మాత్రము విస్మరించకూడదు."

13. ఈ కేసు యొక్క మూలాన్ని చేరుకోవడానికి మొదటి ప్రతివాది యొక్క కస్టడీ విచారణ అవసరమని కోర్టు చివరగా పేర్కొంది.

14. సిబిఐ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి యొక్క ఉత్తర్వు తో వ్యధితుడైన మొదటి ప్రతివాది గుజరాత్ హైకోర్టు ముందు ముందస్తు జామీను కోసం దరఖాస్తు చేసినారు. ఇంతలో, 22 నవంబర్, 2022న

సిబిఐ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి, ప్రతివాది నెంబరు 1కి వ్యతిరేకంగా నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.

15. ప్రస్తుతం సవాలు చేయబడుతున్న తేదీ 2022 డిసెంబర్ 19 నాటి ఉత్తర్వు ద్వారా హైకోర్టు మొదటి ప్రతివాది కి ముందస్తు జామీను మంజూరు చేసింది. ఈ ఉత్తర్వు లో నగదు ధారా అంగడియా సంస్థలోని వర్ధమాన్ ఖాతాలో జమ చేయబడినందున మొదటి ప్రతివాది చట్టవిరుద్ధమైన ప్రతిఫలాన్ని అంగీకరించినట్లు గా చెప్పబడుతున్న విషయంలో సందేహం ఉందని, ఈ మొత్తాన్ని అంగీకరించడానికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవని హైకోర్ట్ అభిప్రాయపడినది. ముందస్తు జామీను మంజూరు చేయడానికి హైకోర్టు పేర్కొన్న కారణాలు ఈ ఉత్తర్వులోని 12వ పేరాలో, ఈ క్రింది విధంగా నమోదు చేయబడ్డాయి :

> "12. ఈ న్యాయస్థానం ఈ క్రింది అంశాలను పరిశీలించింది;
>
> (i) 04.10.2022 న జరిగినట్లుగా ఆరోపించబడిన నేరానికి గానూ 12.10.2022 న ఎఫ్ఐఆర్ నమోదు చేయబడింది.
>
> (ii) తనకు, దర్యాప్తు అధికారి మొదటి ప్రతివాదికి వ్యతిరేకంగా ఏ విధమైన ప్రత్యేక పరిస్థితులనైనా సూచించినట్లుగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రికార్డు లోనికి తీసుకురాలేకపోయారు.
>
> (iii) దరఖాస్తుదారుడు/నిందితుడికి ఆపాదించబడిన పాత్ర;
>
> (iv) దరఖాస్తుదారుడు ఒక అదనపు ఆదాయపు పన్ను కమిషనర్, అతని పై ఏ ఇతర నేర పూర్వపు నడత సూచన లేదు;
>
> (v) నగదు చెల్లింపు యొక్క డిమాండ్ మరియు స్వీకరణ గురించి తీవ్రమైన సందేహం కలుగుతున్నది;
>
> (vi) దరఖాస్తుదారుని వద్ద ఏమియు కనుగొనబడలేదు మరియు ఏమియు స్వాధీనపరుచుకోబడలేదు.

16. ఈ ఉత్తర్వు నందు ముందస్తు జామీను మంజూరు చేసినప్పటికీ, CBI వారు మొదటి ప్రతివాది యొక్క పోలీసు రిమాండ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, అధికారం గల మెజిస్ట్రేట్ దానిని

అనుమతించి నట్లైతే ఆ  రిమాండ్ పూర్తయిన వెంటనే మొదటి ప్రతివాదిని విడుదల చేయవలెనని హైకోర్టు ఆదేశించింది. దీనికి  సంబంధించిన ప్రస్తుతం వివాదం లో ఉన్న ఉత్తర్వులో    ఈ క్రింది విధంగా చెప్పబడినది :

> “16. ఈ ఉత్తర్వు ఉన్నప్పటికీ, దరఖాస్తుదారుడి పోలీసు రిమాండ్ కోసం సమర్థ మేజిస్ట్రేట్ నకు దరఖాస్తు చేయడానికి దర్యాప్తు సంస్థకు అవకాశం ఉంటుంది. దరఖాస్తుదారుడు అటువంటి దరఖాస్తును విచారించిన మొదటి తేదీన మరియు ఆ తరువాత మేజిస్ట్రేట్ ఆదేశించిన అన్ని సందర్భాల్లో మేజిస్ట్రేట్ ముందు హాజరుకావాలి. పోలీసు రిమాండు కోసం పరిగణించు యొక్క దరఖాస్తును ఆమోదించే ఉద్దేశ్యంతో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నిందితులను విచారించడానికి ఇది సరిపోతుంది.అయితే, ఇది రిమాండు ఆదేశానికి వ్యతిరేకంగా నిందితుడు స్టే కోరుకునే హక్కుకు లోబడి ఉంటుంది. శాసనానికి   అనుగుణంగా అటువంటి అభ్యర్థనను పరిగణనలోకి  తీసుకునే అధికారం   మేజిస్ట్రేట్ కి ఉంటుంది  . చివరికి పోలీసు రిమాండు వ్యవధి పూర్తయిన తర్వాత దరఖాస్తుదారుడు పోలీసు కస్టడీకి రిమాండు చేయబడినప్పటికీ, ఈ ముందస్తు జామీను ఉత్తర్వు యొక్క ఇతర షరతులకు లోబడి, అతను వెంటనే విడుదల చేయబడవలెను. కేసు యొక్క        విచారణ సందర్భంగా  ,  ఈ కోర్టు ముందస్తు జామీను ఇస్తూ వెలువరిచిన ప్రాధమిక అభిప్రాయాల వలన విచారణ చేసే కోర్టు ఏ విధంగాను ప్రభావితం కాకూడదు       .నియమం సంపూర్ణం   చేయబడినది. ఉత్తర్వు ప్రతిని నేరు గా పొందడానికి పొందడానికి అనుమతించడమైనది.”

17. హైకోర్టు ఆదేశాలను అనుసరించి, మొదటి ప్రతివాది దర్యాప్తులో పాల్గొని మూడు రోజుల పాటు హాజరయ్యారు, అయితే పదేపదే కోరినప్పటికీ అతడు తన మొబైల్ ఫోన్ (ల) ను చూపించలేదని పేర్కొన్నారు.సిబిఐ, అప్పుడు, మొదటి ప్రతివాది యొక్క పోలీసు రిమాండ్ కోసం దరఖాస్తు చేసింది మరియు 30 డిసెంబర్, 2022న, ప్రత్యేక న్యాయమూర్తి / సిబిఐ కోర్టు నంబర్ 3, ఈ దరఖాస్తును పాక్షికంగా అనుమతించింది.సాక్ష్యము, కేసు డైరీని పరిశీలించిన తరువాత, మొదటి ప్రతివాదిపై ఆరోపణలు బాగా నిరూపితమైనట్లుగా కనిపిస్తున్నాయని, గుర్తింపబడని సాక్ష్యాల లింకులను

సేకరించడానికి మరియు భారీ కుట్రను వెలికి తీయడానికి తగు దర్యాప్తు కోసం రిమాండ్ అవసరమని అభిప్రాయపడింది. ఈ క్రింది నిబంధనలతో దరఖాస్తు అనుమతించబడింది:

> "నిందితుడు, మిస్టర్ సంతోష్ కుమార్ కర్నాని, విచారణ అధికారి, సిబిఐ/ఎసిబి/గాంధీనగర్ కస్టడీ ముందు 01-01-2023, 02-01-2023, 03-01-2023 ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు కస్టడీ విచారణ నిమిత్తము హాజరు కావాలని ఆదేశించడమైనది. ఆయా తేదీలలో నిందితుడిని రాత్రి 7 గంటలకు విడుదల చేయాలని కూడా ఆదేశించడమైనది. మరియు , గౌరవనీయమైన గుజరాత్ హైకోర్టు ఆదేశాల మేరకు, పైన పేర్కొన్న రిమాండు వ్యవధి పూర్తయిన తర్వాత, నిందితుడిని విడుదల చేసి, వైద్య పరీక్ష పత్రం/సర్టిఫికేట్ కాపీలతో పాటు ఈ కోర్టుకు నివేదికను సమర్పించాలి. కేసు డైరీని తిరిగి దర్యాప్తు అధికారికి అప్పగించాలి.ఈ కేసులో సరైన దర్యాప్తు జరపడానికి దర్యాప్తు అధికారికి పూర్తి సహకారం అందించాలని నిందితుడిని ఇందుమూలంగా ఆదేశించడమైనది.
>
> డి. కె. బసు వర్సెస్ వెస్ట్ బెంగాల్ రాష్ట్రం (AIR 1997 SC 610 లో నివేదించబడిన) కేసులో గౌరవనీయమైన సుప్రీంకోర్టు వారు మరియు గుజరాత్ హైకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని దర్యాప్తు అధికారిని దీని ద్వారా ఆదేశించడమైనది. నిందితుడు కస్టడీలో ఉండగా, కస్టడీలో అతడిని ఎలాంటి అవమానానికి గాని లేదా హింసకు గాని గురి చేయకూడదు."

18. ఆ తరువాత, గుజరాత్ హైకోర్టు ముందు దీనిని సవాలు చేయాలనుకుంటున్నారనే కారణంతో పైన పేర్కొన్న ఉత్తర్వుల నిలుపుదల కోసం దరఖాస్తును ప్రత్యేక సిబిఐ కోర్టు ముందు సిబిఐ దాఖలు చేసింది. అందువల్ల, ప్రత్యేక న్యాయమూర్తి, సిబిఐ కోర్టు నెం. 3 తన ఉత్తర్వుల అమలును 2023 జనవరి 7 వరకు నిలిపివేశారు. తరువాత ఆ నిలుపుదల పొడిగింపబడినది.

**వాదప్రతివాదములు**

19. మొదటి ప్రతివాది కి ముందస్తు జామీను మంజూరు చేస్తూ ఇవ్వబడిన ప్రస్తుత వివాదాస్పద ఉత్తర్వును ప్రతిహతిస్తూ, సిబిఐ తరపున భారత సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ క్రింది వాదనలు చేశారుః

i. నేరం యొక్క గంభీరతను మరియు తీవ్రతను మరియు మొదటి ప్రతివాది వహించిన పదవిని పరిగణనలోకి తీసుకుంటే, సి. ఆర్. పి. సి. లోని సెక్షన్ 438 కింద తన వివేచనాత్మక అధికార పరిధిని వినియోగించడం లో హైకోర్టు విఫలమైనది.

ii. మొదటి ప్రతివాది కి వ్యతిరేకంగా సేకరించిన విషయాలకు హైకోర్టు విలువ ఇవ్వలేదు, అతని యొక్క వాయిస్ రికార్డింగ్స్ అతను ఫిర్యాదు దారు నుండి 30 లక్షల లంచంను డిమాండ్ చేయడం మరియు, ఆ సొమ్ము చెల్లింపును గుర్తించడం ద్వారా దానిని అంగీకరించడము , స్పష్టంగా రుజువు పరుస్తూన్నాయి. ఈ సంబధిత వాయిస్ రికార్డింగులను విశ్లేషించి అందులోని స్వరాలు మొదటి ప్రతివాది మరియు ఫిర్యాదుదారునది అని గుర్తించడం జరిగినది.

iii. సుదీర్ఘ జాప్యం తర్వాత 2022 అక్టోబర్ 12న ఎఫ్ఐఆర్ నమోదు చేయబడిందనడంలో హైకోర్టు తీవ్రంగా పొరబడినది. మొదటగా 4 అక్టోబర్, 2022న ఎసిబి పోలీస్ స్టేషన్ నేరాన్ని నమోదు చేసింది మరియు ఇదే నేరాన్ని తిరిగి 12-10-2022 న సిబిఐ నమోదు చేసింది.

iv. 2015 సంవత్సరానికి గాను ఆదాయపు పన్ను శాఖలోని గ్రూప్ ఎ అధికారులకు సంబంధించి మొదటి ప్రతివాదిపేరు 'అంగీకరించిన జాబితాలో' చేర్చబడింది, అందువల్ల, అతని సర్వీస్ రికార్డ్ నిష్కళంకంగా లేదు.

v. వాట్సప్ కాల్ ద్వారా లంచం డబ్బు చెల్లించినట్లు అంగీకరించిన తరువాత ఎసిబి బృందం అతని కార్యాలయంపై దాడి చేసినప్పుడు మొదటి ప్రతివాది అరెస్టును తప్పించుకున్నాడు. మొదటి ప్రతివాది మరియు అతని సహచరులు ఎసిబి బృందాన్ని అరెస్టు చేయకుండా మరియు భౌతిక

సాక్ష్యము సేకరించకుండా నిరోధించడానికి అపరాధిక బలము ఉపయోగించారు. అలా చేస్తున్నప్పుడు, మొదటి ప్రతివాది కీలకసాక్షాధారమైన త న మొబైల్ ఫోన్ ను తన సహూద్యోగికి అప్పగించాడు, ఈ కీలక సాక్ష్యాదారము దర్యాప్తు బృందానికి చేతికి చిక్కకుండ చూడ్డానికే దానికి తన సహోద్యోగికి అప్పగించాడు. ఇది కార్యాలయంలోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయింది.

vi. ఆడియో రికార్డింగులు మరియు వీడియో ఫుటేజీలను గుజరాత్ లోని డైరెక్టరేట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ పరిశీలించి వాటి నిజాయితీని ధృవీకరించింది. వీనిని మార్చిన సూచనలు ఏమి లేవని ఈ నివేదిక తేల్చింది;

vii. మొదటి ప్రతివాది తాను సమర్థ అధికారి నుండి సాధారణ సెలవు తీసుకున్నానని చెప్పడం ద్వారా , జైపూర్ లోని బ్లూ హెవెన్ హోటల్ ఇమెయిల్ ఐడి ద్వారా సి.ఆర్.పి.సి. సెక్షన్ 41ఎ కింద జారీ చేసిన నోటీసుకు సమాధానం పంపినట్లు చూపడం ద్వారా, దర్యాప్తు సంస్థను తప్పుదోవ పట్టించినారు. విచారణలో, మొదటి ప్రతివాది ఆ హోటల్లో ఎప్పుడూ ఎప్పుడు బస చేయలేదని, కనుగొనబడింది.

viii. దర్యాప్తు సమయంలో, ఇతర ఆదాయపు పన్ను అధికారులు మొదటి ప్రతివాదితో చేతులు కలిపారని చూపించడానికి నమ్మదగిన సాక్ష్యాలు రికార్డులోకి వచ్చాయి, కొంతమంది అధికారులు మొదటి ప్రతివాదిని అరెస్టు నుండి తప్పించడానికి చురుకైన పాత్ర పోషించిన విషయము కూడా స్పష్టంగా తెలుస్తున్నది. ఈ లోతైన కుట్రను ఛేదించడానికి, ఇతర ఆదాయపు పన్ను అధికారుల ప్రమేయాన్ని పరిశీలించడానికి కస్టోడియల్ విచారణ చాలా అవసరం.

ix.హైకోర్టు మంజూరు చేసిన రక్షణ తర్వాత మొదటి ప్రతివాదిసిబిఐ ముందు హాజరయ్యారు, కానీ తన మొబైల్ హ్యాండ్సెట్లను అప్పగించలేదు, ఇది కీలకమైన సాక్ష్యము, ఈ విధంగా , దర్యాప్తుకు సహకరించలేదు.

దర్యాప్తును దాని తార్కిక ముగింపుకు తీసుకెళ్లడానికి ఈ కేసులో నిర్బంధ విచారణ అవసరం.

**x.** ఇలాంటి సందర్భంలో, అనుమానిత వ్యక్తిని సమర్థవంతంగా విచారించడం వల్ల చాలా ఉపయోగకరమైన సమాచారం మరియు దాచబడిన విషయాలను కూడా వెలికిదీయడంలో విపరీతమైన ప్రయోజనం ఉంటుంది. తనను విచారించే సమయంలో ముందస్తు జామీను ఉత్తర్వు ద్వారా తాను బాగా రక్షించబడ్డానని మరియు నిరోధించబడ్డానని అనుమానిత వ్యక్తికి తెలిస్తే అటువంటి విచారణలో విజయం లభించదు.చాలా తరచుగా అటువంటి పరిస్థితిలో విచారణ కేవలం ఆచారంగా మారిపోతుంది అన్న వాదానికి ఆధారంగా ఈ కోర్టు వారు *State Rep. By The CBI v.Anil Sharma*[1] 1 (1997) 7 ఎస్సీసీ 187 కేసులో ఇచ్చిన తీర్పుపై ఆధారం ఉంచడం జరిగింది. సెక్షన్ 438 కింద అనుకూలమైన ఉత్తర్వు ఉన్న అనుమానితుడిని ప్రశ్నించడం కంటే కస్టడీ విచారణ అనేది గుణాత్మకంగా మరింత స్పష్టతతో కూడుకున్నదని అనిల్ శర్మ కేసులో ఈ కోర్టు వారు నిర్దేశించినారు . ఈ నిర్దేశం పైన సిబిఐ ఆధారం ఉంచినది.

**xi.**పరారీలో ఉన్న వ్యక్తికి ముందస్తు జామీను మంజూరు చేయకూడదు. ఈ విషయంగా ప్రేమ్ శంకర్ ప్రసాద్ వర్సెస్ బీహార్ రాష్ట్రం (2021 SCC OnLine SC 955), మధ్యప్రదేశ్ రాష్ట్రం వర్సెస్ ప్రదీప్ శర్మ ((2014) 2 SCC 171) మరియు లవేష్ వర్సెస్ రాష్ట్రం (ఎన్సిటి ఆఫ్ ఢిల్లీ) (4 (2012) 8 SCC 730) కేసుల్లోని తీర్పుల పైన ఆధారం ఉంచడం జరిగింది.

**xii.** హైకోర్టు వారు , మొదటి ప్రతివాది యొక్క పోలీసు రిమాండ్ కోసం సమర్థ మేజిస్ట్రేట్ నకు దరఖాస్తు చేయడానికి స్వేచ్ఛ ఉంది అని అంటూ ఆదే సమయం లో , ప్రధాన అనుమానితుడి కస్టడీ విచారణను నిరోధిస్తూ ఒక అసాధారణ ఉత్తర్వును జారీ చేసినారు.

20. ఫిర్యాదుదారుడి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది మనీందర్ సింగ్, సిబిఐ వారి వాదనలకు మద్దతుగా అదనపు వాదనలు ఈ క్రింది విధంగా చేశారుః

i. ముందస్తు జామీను కోసం మొదటి ప్రతివాది చేసిన దరఖాస్తును తిరస్కరించేటప్పుడు సెషన్స్ కోర్టు నమోదు చేసిన పరిశీలనలను, నిర్ధారణలను హైకోర్టు విస్మరించింది. కేసు పత్రాలతో సహా రికార్డులో ఉన్న విషయాలను పరిశీలించిన కోర్టు, అప్పుడు మాత్రమే దర్యాప్తు సంస్థ ప్రతిపాదించిన సంగతి యొక్క మూలాన్ని చేరుకోవడానికి వీలుగా నిర్బంధ విచారణ అవసరమని గమనించింది.

ii. ఫిర్యాదుదారుడు డిజిటల్ వాయిస్ రికార్డర్లో రికార్డ్ చేసిన సంభాషణ ద్వారా మొదటి ప్రతివాది రూ. 30 కోట్ల కోసం చేసిన స్పష్టమైన డిమాండు మరియు ధారా అంగడియా సంస్థ ద్వారా ఆ లంచం డబ్బును అంగీకరించడం స్పష్టంగా నిరూపితమైన విషయాన్ని గుర్తించడంలో హైకోర్టు విఫలమైనది.

21. మరోవైపు, సీనియర్ న్యాయవాదులు అయిన మిస్టర్ ముకుల్ రోహత్గీ మరియు మిస్టర్ శ్యామ్ దివాన్, మొదటి ప్రతివాదిపై చేసిన నిందలను తమ వాదనలో తీవ్రంగా ఖండించారు మరియు ముందస్తు జామీను మంజూరు చేస్తూ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను ఈ క్రింది వాదనలతో సమర్థించారుః

i. మొదటి ప్రతివాదిపై చేసిన ఆరోపణలు అబద్ధమైనవి మరియు కల్పితమైనవి.ఫిర్యాదుదారు ఆరోపించినట్లుగా మొదటి ప్రతివాది ప్రతిఫలం, కోసం ఎటువంటి డిమాండును ఎప్పుడూ లేవనెత్తలేదు. 2021 ,సెప్టెంబర్ లో ఫిర్యాదుదారుని సంస్థపై చేసిన శోధన మరియు జప్తు చర్యతో లేదా మదింపు నివేదిక తయారీతో మొదటి ప్రతివాది కి ఎటువంటి సంబంధం లేదు. ఫిర్యాదుదారుడి కేసు లో మొదటి ప్రతివాది మదింపు ఆఫీసర్ కాదు ఈ బాధ్యత మరొక అధికారికి అప్పగించబడింది;

ii. నేరాన్ని నిరూపించడానికి అవసరమైన లంచం డిమాండ్ లేదా స్వీకరణకు సంబంధించిన ఎటువంటి సాక్ష్యములు లేవు. అవినీతి

నిరోధక చట్టము సెక్షన్ 7 కింద చేయబడే ట్రాప్ కేసులలో, డిమాండ్ యొక్క సంభాషణను ఫిర్యాదుదారుడు స్వతంత్ర పంచాయితీ దారుల సమక్షంలో నమోదు చేయవలసి ఉంటుంది ఇంకా ఎటువంటి తారుమారు జరిగే అవకాశం లేదని ట్రాప్ చేసే అధికారి నిర్ధారించడం జరగాలి. కానీ ప్రస్తుత కేసులో ఆరోపింబడిన డిమాండ్ యొక్క వాయిస్ రికార్డింగ్ ఎటువంటి పోలీసు ప్రమేయం లేకుండా జరిగింది. అందువల్ల, ఇది ఎటువంటి సాక్ష్య విలువను కలిగి లేదు. ఈ మొత్తాన్ని అంగడియా సంస్థలో జమ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి, ఇది మొదటి ప్రతివాది కి తెలియని విషయము అందువల్ల ఇది లంచం స్వీకరణ అనలేము. మొదటి ప్రతివాదికి ఈ మొత్తం జమ చేసిన ఖాతాకు యజమాని అని పేర్కొనబడిన మాలవ్ అజిత్ భాయ్ మెహతాతో ఎటువంటి సంబంధం లేదు. ఆ సమయము లో మొదటి ప్రతివాది అంగడియా సంస్థ ఉన్న ప్రదేశంలో లేదు.

iii. ఫిర్యాడిదారుని కంపెనీపై 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబందించి తీసుకున్న సర్వే చర్య వలన ఆ కంపెనీ బహిర్గత పరచని 50 కోట్ల రూపాయల ఆదాయం ఉన్నట్లు బయటపడిన కారణంగా ఫిర్యాదుదారునికి కి మొదటి ప్రతివాదితో గత శత్రుత్వం ఉంది. ఈ వాస్తవాన్ని ఎఫ్ఐఆర్లో వెల్లడించలేదు. మొదటి ప్రతివాది తనపై మరియు తన కంపెనీపై భారీ పన్ను భారాన్ని విధిస్తారనే భయంతో ఫిర్యాదుదారు మొదటి ప్రతివాదిని అక్రమ కేసులో ఇరికించినారు.

iv. ఎఫ్ఐఆర్ నెం. 12/2022 ను పరిశీలించినప్పుడు ఇది 4 అక్టోబర్, 2022 న 9:30 గంటలకు నమోదు చేయబడిందని తెలుపుతుండగా, ఆరోపించిన డిమాండ్ చర్యలు, ట్రాప్ వేయడం, ధారా అంగడియా వద్ద డబ్బు జమ చేయడం మరియు మొదటి ప్రతివాది యొక్క కార్యాలయం వద్ద దాడి ఇవన్నీ 3 అక్టోబర్, 2022న మరియు 4 అక్టోబర్, 2022న పగటిపూట జరిగినవి. పైగా ఫిర్యాదుదారుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందు పోలీసు అధికారులను కలిసిన దాఖలాలు లేవు.

అక్రమ ప్రతిఫలం డిమాండ్ చేసిన 24 గంటల కంటే ఎక్కువ సమయం తరువాత ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో గల ఆలస్యం గురించి వివరణ లేదు.

v. మొదటి ప్రతివాది ని మాత్రమే అరెస్టు చేయాలని సిబిఐ కోరుతున్నది. ధారా అంగడియా సంస్థ యజమాని లేదా ఉద్యోగులను అరెస్టు చేయలేదు. మరియు మాలవ్ మెహతాకు ముందస్తు జామీను మంజూరు చేసిన హైకోర్టు ఉత్తర్వులను ఈ కోర్టు ముందు సిబిఐ సవాలు చేయలేదు;

vi. మొదటి ప్రతివాదిని అరెస్టు చేయడానికి సంబంధించి సిఆర్పిసి సెక్షన్ 41ఎ లోని నిబంధనలను సిబిఐ దుర్వినియోగం చేసింది. అర్నేష్ కుమార్ వర్సెస్ బీహార్ రాష్ట్రం కేసులో ఈ కోర్టు వారు నిర్దేశించిన నిబంధనలను మరియు మార్గదర్శకాలను పూర్తిగా పరిశీలించినప్పుడు దర్యాప్తు సంస్థ, ఒక వ్యక్తిని అదుపులో తీసుకోవాల్సిన అవసరం లేనప్పుడు మాత్రమే సెక్షన్ 41ఎ కింద నోటీసు జారీ చేయవలసిఉన్నది. కానీ ప్రస్తుత కేసులో, ఎసిబి బృందం సెక్షన్ 41ఎ కింద నోటీసులు జారీ ఇవ్వడానికి చాలా ముందుగానే అనగా వారు మొదటి ప్రతివాది కార్యాలయం పై దాడి చేసినప్పుడే, అతన్ని అరెస్టు చేయాలని నిర్ణయించడం జరిగినది.

vii. ఈ న్యాయస్థానం వారు స్థిరపరిచిన చట్ట నిబంధనల ప్రకారం, మొదటి ప్రతివాది ని పరారీలో ఉన్న వ్యక్తిగా పేర్కొనలేము, ఎందుకంటే అతను తన చట్టపరమైన పరిష్కారాలను పొందుతున్నాడు. అయినప్పటికి, దర్యాప్తు సంస్థ మీడియాలో నోటీసులను ప్రచురించినది మరియు వివిధ ప్రదేశాలలో మొదటి ప్రతివాది పేరు , ఫోటో మరియు హోదాతో కూడిన 'వాంటెడ్' ప్రకటనలను అతికించినది. ఇది దర్యాప్తు సంస్థ యొక్క దురుద్దేశాలను సూచిస్తుంది.

viii. మొదటి ప్రతివాది యొక్క నిజాయితీ ముందస్తు జామీను మంజూరు చేసిన తరువాతి ప్రవర్తనలో స్పష్టంగా తెలుస్తుంది. హైకోర్టు ఆదేశాల మేరకు, మొదటి ప్రతివాది కనీసం నాలుగు సందర్భాల్లో, పిలిచినప్పుడల్లా

సిబిఐ ముందు హాజరయ్యారు.మొదటి ప్రతివాది స్వచ్ఛందంగా తన స్వర నమూనాలను ఇచ్చారు. మొదటి ప్రతివాది దర్యాప్తుకు సహకరిస్తున్నందున, నిర్బంధ విచారణ అవసరం లేదు. ముందస్తు జామీను మంజూరు చేసినప్పటికీ, పోలీసు రిమాండ్ కోసం సమర్థ మేజిస్ట్రేట్కు దరఖాస్తు చేయడానికి దర్యాప్తు సంస్థకు స్వేచ్ఛ ఉంటుందని హైకోర్టు ఆదేశించడంలో పొర బడినది. ఉత్తర్వులోని ఈ భాగం మొదటి ప్రతివాదికి ప్రతికూలంగా ఉంది, అయినా అతను దానికి కట్టుబడి ఉన్నాడు. మరియు సిబిఐ పోలీసు రిమాండ్ కోసం దరఖాస్తు చేసినప్పుడు కోర్టు ముందు హాజరయ్యాడు;

ix. డిపార్ట్మెంట్ లోని అత్యంత సున్నితమైన నియత కార్యాలల్లో ఒకదానికి మొదటి ప్రతివాదిని నియామకం చేయడం బట్టి అతనికి నిష్కళంకమైన సేవా రికార్డు ఉందని స్పష్టమవుతుంది. ఇటువంటి నియామకాలు స్వచ్ఛమైన వ్యక్తిత్వం ఉన్న ఉన్నత అధికారులకు మాత్రమే ఇవ్వబడతాయి. అతని చిత్తశుద్ధి సందేహాతీతమైనది మరియు కళంకం లేని గత రికార్డు అతనికి ఉన్నది . మొదటి ప్రతివాదికి వ్యతిరేకంగా అసమంజసపు ఆస్తుల కేసు ఏదీ లేదు.

x. అధికారిక కృత్యములు లేదా విధులను నిర్వర్తిస్తూ తీసుకున్న ఏదైనా నిర్ణయం లేదా సిఫారసుకు సంబంధించి ప్రభుత్వ ఉద్యోగి చేసిన నేరంపై సమర్థ అధికారి యొక్క ముందస్తు ఆమోదం లేకుండా, పోలీసు అధికారి ఏదైనా గుప్త విచారణ, విచారణ లేదా దర్యాప్తు చేయడం పై , 2018లో సవరించిన అవినీతి నిరోధక చట్టము, 1988 లోని సెక్షన్17ఎ, నిషేదిస్తున్నది. ఈ కేసులో, దర్యాప్తు సంస్థ సెక్షన్ 17ఎ యొక్క ఈ తప్పనిసరి విధానాన్ని పాటించలేదు మరియు సమర్ద అధికారి ముందస్తు అనుమతి లేకుండానే ఫిర్యాదుపై దర్యాప్తు ప్రారంభించింది.ఈ తప్పనిసరి షరతును ఉల్లంఘించడం మొదటి ప్రతివాది కి వ్యతిరేకంగా ప్రారంభించిన చర్యలను నిష్ఫలం చేస్తుంది.

xi. పై కారణాల వలన , హైకోర్టు వారు మొదటి ప్రతివాదికి ముందస్తు జామీను సక్రమంగా జారీ చేసినారు. ఈ వివాదాస్పద ఉత్తర్వులోని 12వ పేరాలో ఈ ఉత్తర్వుకు సమర్ధనీయమైన కారణాలను పొందుపరిచినారు.

xii. జామీనును తిరస్కరించడంతో పోలిస్తే జామీనును రద్దు చేయడాన్ని పూర్తిగా భిన్నమైన ప్రాతిపదికన ఎదుర్కోవలసి ఉంటుంది మరియు ఒకసారి మంజూరు చేసిన తర్వాత జామీనును రద్దు చేయడానికి 'ఖచ్చితమైన మరియు అధికమైన' కారణాలు అవసరం. ఈ విషయానికి గాను దోలత్ రామ్ వర్సెస్ హర్యానా రాష్ట్రం ( 6 (1995) 1 ఎస్సీసీ 349.) కేసులో, ఈ కోర్టు యొక్క ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన తీర్పు పై ఆధార పడుతున్నాము. ఈ తీర్పులో ఈ క్రింది విధంగా చెప్పినారు.

"4. ప్రారంభ దశలో నాన్ బెయిలబుల్ జామీనును తిరస్కరించడం, మంజూరు చేసిన జామీనును రద్దు చేయడము, ఈ రెండింటినీ వివిధ ప్రాతిపదికలలో పరిగణించాలి. ఇప్పటికే మంజూరు అయిన జామీనును రద్దు చేయాలంటే ఉత్తర్వుకు చాలా ఖచ్చితమైన మరియు విపరీతమైన పరిస్థితులు అవసరం.సాధారణంగా చెప్పాలంటే, జామీను రద్దు చేయడానికి ఆధారాలు, విస్తృతంగా (వివరణాత్మకమైనవి మరియు సమగ్రమైనవి కావు): న్యాయ పరిపాలనలో జోక్యం చేసుకోవడం లేదా జోక్యం చేసుకోవడానికి ప్రయత్నము లేదా న్యాయ ప్రక్రియను తప్పించుకోవడం లేదా తప్పించుకోవడానికి ప్రయత్నము లేదా ఏ విధంగానైనా నిందితుడికి మంజూరు చేసిన రాయితీని దురుపయోగము చేయడం. నిందితుడు పరారయ్యే అవకాశాల గురించి రికార్డులో ఉంచిన విషయాల ఆధారంగా కోర్టు సంతృప్తి చెందడం, జామీను రద్దు చేయడాన్ని సమర్థించే మరో కారణం. ఏదేమైనా, నిందితుడు కేసు విచారణ సమయంలో జామీను పై ఉండటం వలన నిష్పాక్షికపమైన న్యాయ విచారణకు అననుకూలంగా ఉన్న అసాధారణ పరిస్థితులు

ఏవైనా ఉండడం గురించి పరిగణనలోనికి తీసుకోకుండా , ఒకసారి మంజూరు చేసిన జామీనును యాంత్రికంగా రద్దు చేయకూడదు.

xiii. జామీను రద్దు చేయడానికి ఎటువంటి పర్యవేక్షణ పరిస్థితులను సిబిఐ లేదా ఫిర్యాదుదారు సూచించలేదు.

**విశ్లేషణ**

22. **గుర్బక్ష్ సింగ్ సిబియా వర్సెస్ పంజాబ్ రాష్ట్రం (7 (2011) 1 ఎస్సీసీ 694)** కేసులో రాజ్యాంగ ధర్మాసనం రూపొందించిన పారామితులను తగిన విధంగా వివేచన చేసిన తరువాత **సట్లింగప్ప మేత్రే వర్సెస్ మహారాష్ట్ర రాష్ట్రం** కేసు లో ముందస్తు జామీను మంజూరు పై చట్టాన్ని ఈ కోర్ట్ ఈ క్రింది విధంగా పేర్కొన్నది :

112. ముందస్తు బెయిల్ విషయంలో వ్యవహరించేటప్పుడు ఈ క్రింది అంశాలు మరియు పారామితులను పరిగణనలోకి తీసుకోవచ్చు:

(i) అరెస్టు చేయడానికి ముందు నిందారోపణ యొక్క స్వభావం మరియు తీవ్రత మరియు నిందితుడి యొక్క ఖచ్చితమైన పాత్రను పరిగణనలోనికి తీసుకోవాలి.

(ii) ఏదైనా గుర్తించదగిన నేరానికి సంబంధించిన నేరారోపణపై గతంలో ఏదైనా అధికారికంగా విచారణార్హమైన నేరానికి గాను ధరఖాస్తుదారుడినిని ఏదైనా కోర్ట్ చే దోషిగా నిర్ణయించినబడి కారాగార శిక్ష అనుభవించినాడా అన్న విషయం తో పాటు అతని పూర్వపు నడవడిక :

(iii) దరఖాస్తుదారుడు న్యాయ ప్రక్రియ నుండి తప్పించుకొని పోయే అవకాశం;

(iv) నిందితుడు ఇలాంటి లేదా ఇతర నేరాలను పునరావృతం చేసే అవకాశం;

(v) దరఖాస్తుదారుని అరెస్టు చేయడం ద్వారా అతన్ని లేదా ఆమెను క్షోభకు గురి చేసే లేదా అవమానపరిచే లక్ష్యంతో మాత్రమే ఆరోపణలు చేసినట్లయితే;

(vi) ముందస్తు జామీను యొక్క ప్రభావపు పరిధి ముఖ్యంగా చాలా పెద్ద సంఖ్యలో ప్రజలను ప్రభావితం చేసే అవకాశం;

(vii) నిందితులకు వ్యతిరేకంగా అందుబాటులో ఉన్న విషయాలను అన్నింటిని న్యాయస్థానాలు చాలా జాగ్రత్తగా మదింపుచేయాలి. కేసులో నిందితుల ఖచ్చితమైన పాత్రను కూడా కోర్టు స్పష్టంగా అర్థం చేసుకోవాలి.1860 నాటి శిక్షాస్మృతిలోని 34,149 సెక్షన్ల సహాయంతో నిందితుడిని ఇరికించిన కేసులను కోర్టు మరింత జాగ్రత్తగా మరియు మెలకువతో పరిగణించాలి, ఎందుకంటే ఇలాంటి కేసులలో ఎక్కువగా అక్రమంగా ఇరికించడం అనేది సాధారణం మరియు ఆందోళన కలిగించే విషయం.

(viii) ముందస్తు జామీను మంజూరు కోసం చేసిన అభ్యర్థనను పరిశీలించేటప్పుడు, స్వేచ్ఛయుతమైన , న్యాయబద్ధమైన మరియు సంపూర్ణమైన దర్యాప్తునకు ఎటువంటి ఆటంకం కలిగించకూడదు మరియు వేధింపులు , అవమానం అన్యాయమైన నిర్బంధం నిరోధింపబడాలి అనే రెండు అంశాల మధ్య సమతుల్యతను సాధించాలి

(ix) సాక్ష్యాలను తారుమారు చేయవచ్చు లేదా ఫిర్యాదుదారునికి ముప్పు కలిగించవచ్చనే విషయాలకు సంబంధించి సహేతుకమైన అనుమానాలను కోర్టు పరిగణనలోకి తీసుకోవాలి;

(x) ప్రాసిక్యూషన్ కథనం లోని నిస్సారతను ఎల్లప్పుడూ పరిగణించాలి మరియు జామీను మంజూరు విషయంలో పరిగణించవలసినది వాస్తవ అంశాలు మాత్రమే. ప్రాసిక్యూషన్ కథనం వాస్తవికత గురించి ఏ మాత్రమైనా సందేహం ఉన్న సందర్భంలో, సాధారణ క్రమంలో నిందితుడికి జామీను ఉత్తర్వు అర్హత ఉంటుంది."

23. ముందస్తు జామీను కోసం చేసుకున్న ధరఖాస్తులను పరిశీలించే క్రమం లో నేరాల స్వభావం మరియు తీవ్రత, దరఖాస్తుదారుడి పాత్ర మరియు కేసు లోని వాస్తవాల వంటి అంశాల ద్వారా మాత్రమే కోర్టులు మార్గనిర్దేశం చేయబడాలి అని రాజ్యాంగ ధర్మాసనం **సుశీలా అగర్వాల్ వర్సెస్ స్టేట్ (ఎన్. సి. టి. ఆఫ్ఢిల్లీ) (9 (2020) 5 ఎస్సీసీ 1)** కేసులో, పునరుద్ఘాటించింది.

24. ముందస్తు జామీను మంజూరు లేదా తిరస్కరణ కోసం ఎటువంటి ఖచ్చితముగా నిర్దేశించ బడిన సూత్రాన్ని వర్తింపచేయవద్దని , కాల పరీక్షకు నిలిచిన సూత్రాలు నిర్దేశిస్తున్నాయి. న్యాయస్థానం యొక్క న్యాయపరమైన వివేచన, వివిధ సంబంధిత కారణాల ద్వారా ప్రభావితం చేయబడుతుంది. ఇది ఎక్కువగా ప్రతి కేసు యొక్క వాస్తవాలు మరియు పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం హామీ ఇవ్వబడిన వ్యక్తి స్వేచ్ఛకు, న్యాయమైన, స్వేచ్ఛాయుతమైన దర్యాప్తు అవసరానికి మధ్య న్యాయస్థానం సున్నితమైన సమతుల్యతను సాధించాలి, దీనిని దాని తార్కిక ముగింపుకు తీసుకెళ్లాలి.అరెస్టుకు వినాశకరమైన మరియు కోలుకోలేని సామాజిక కళంకం, అవమానం, మానసిక వేదన మరియు ఇతర భయంకరమైన పరిణామాలు ఉన్నాయి.దానితో సంబంధం లేకుండా, దర్యాప్తు సంస్థ సేకరించిన భౌతిక సమాచారాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు, నిందితులపై కేవలం అనుమానం కంటే ఎక్కువ ఏదో ఉందని ప్రాథమికంగా సంతృప్తి పడినప్పుడు, ముఖ్యంగా ఆరోపణలు తీవ్రమైన స్వభావం కలిగి ఉన్నప్పుడు, కోర్ట్ ఎప్పుడూ దర్యాప్తును ప్రమాదము లో పడవేయదు.

25. ఈ సూత్రాలన్నింటిని దృష్టిలో ఉంచుకుని, ఇందలి వాదోపవాదాలను మదింపు చేయాలి , మొదటిగా పరిగణించవలసినది , 2022 సంవత్సరం అక్టోబర్ 3 మరియు 4 తేదీలలో జరిగినట్లు ఆరోపించబడిన నేరానికి గాను తేదీ 12.10.2022 న ఎఫ్ఐఆర్ నమోదు చేయబడిందని గమనించడంలో హైకోర్టు ఖచ్చితంగా పొరబడినదన్న విషయం గమనించాలి. అవినీతి నిరోధక చట్టము, 1988 లోని 7,13 (1) మరియు 13 (2) సెక్షన్ల కింద 2022 అక్టోబర్ 4న మొదటి ప్రతివాది పై ఎసిబి ఎఫ్ఐఆర్ నమోదు చేసింది మరియు 2022, అక్టోబర్ 12న మొదటి ప్రతివాది పై సిబిఐ తిరిగి నేరాన్ని నమోదు చేసింది.

26. మొదటి ప్రతివాడికి ముందస్తు జామీను మంజూరు చేయడానికి హైకోర్టు పరిగణించిన ప్రాథమిక కారణం ఏమిటంటే, మొదటి ప్రతివాదికి మరియు ధారా అంగడియా సంస్థకు మధ్య

సంబంధాన్ని ధృవీకరించే రికార్డులు ఏవీ సమర్పించబడనందున మొదటి ప్రతివాది లంచం మొత్తాన్ని అంగీకరించడంపై సందేహం ఉందన్న విషయం.

27. ధారా అంగడియా సంస్థను నిర్వహించే స్మిత్ ఠక్కర్ ఇచ్చిన వివరణ కలిగి ఉన్న కేస్ డైరీని సిబిఐ సమర్పించింది.వర్ధమాన్ ఖాతాకు మాలవ్ మెహతా యజమాని అని, అక్టోబర్ 4వ తేదీన తన ఖాతాలో 30 లక్షల రూపాయలు జమ చేయనున్నట్లు దానిని తిరిగి మరొకరికి పంపించవలసినట్లు గాను తనకు తెలియజేశారని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడు మరియు మొదటి ప్రతివాది మధ్య జరిగిన సంభాషణ యొక్క ఉద్దేశపూర్వక రికార్డింగ్, ఇందులో ప్రతివాది నెంబరు 1, వర్ధమాన్ ఖాతాలో మొత్తాన్ని జమ చేసిన తర్వాత, ఫిర్యాదుదారునికి కృతజ్ఞతలు తెలుపడాన్ని తెలియచేస్తుంది, ఇది ధారా అంగడియా సంస్థలో జమ చేసిన అక్రమ ప్రతిఫలం తో మొదటి ప్రతివాదిని అనుసంధానించడానికి సహేతుకమైన లింక్, ఇది ప్రాధమికంగా అంగీకారాన్ని తెలుపుతున్నది.

28. ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో 24 గంటలకు పైగా ఆలస్యం జరిగిందని ఆరోపించిన వ్యత్యాసానికి సంబంధించి, ఫిర్యాదుదారుడు 07.15 గంటలకు ఫిర్యాదును వివరించడం ప్రారంభించాడని మా ముందు సమర్పించిన విషయాల నుండి మేము కనుగొన్నాముః మరియు అది 2022 అక్టోబరు 4వ తేదీన 08.00 గంటలకు ముగిసినది. కేసు డైరీలో జతచేయబడిన పంచనామా ఎసిబి వేసిన వ్యూహం వివరాలను అందిస్తున్నది మరియు ఆ రోజు ఎసిబి బృందం యొక్క అన్ని కార్యకలాపాలను నమోదు చేసింది , తద్వారా దర్యాప్తు సంస్థల వైపు నుండి దురుద్దేశపూరిత సందేహాలను తొలగిస్తున్నది.

29. మేము ఆదాయపు పన్ను అసిస్టెంట్ కమిషనర్ శ్రీ వివేక్ జోహ్రీ యొక్క వివరణను కూడా చూశాము, అతను మొదటి ప్రతివాది కార్యాలయం నుండి వెళ్ళేప్పుడు అతని మొబైల్ ఫోన్ ను తనకి ఇచ్చినట్లు గాను దానిని తాను విసిరి వేసినట్లుగానూ మిస్టర్ జోహ్రి చెప్పియున్నారు.

30. మొదటి ప్రతివాది తన సహోద్యోగుల సహాయంతో అరెస్టు నుండి బలవంతంగా తప్పించుకుని, సాక్ష్యమును నాశనం చేసిన విధానము, ఈ దశలో అతని నేర ప్రవృత్తిని సూచించడానికి బలమైన ఆధారం. అయితే పూర్తి దర్యాప్తు తర్వాతనే సంపూర్ణమైన రూపం వెలువడుతుంది.

31. ఆరోపించిన నేరం యొక్క స్వభావం మరియు తీవ్రతను హైకోర్టు దృష్టిలో ఉంచుకోవాలి.అవినీతి మన సమాజానికి తీవ్రమైన ముప్పుగా ఉంది, దీనిని కఠినమైన చర్యలతో

ఎదుర్కోవాలి. ఇది ప్రభుత్వ ఖజానాకు ఘోరమైన నష్టాన్ని కలిగించడమే కాకుండా సుపరిపాలనను కూడా అణచివేస్తుంది.సామాజిక సంక్షేమ పథకాల కింద లభించే ప్రయోజనాలను సామాన్యులు కోల్పోతున్నారు మరియు వారి ప్రయోజనాలు అత్యంత ఘోరంగా దెబ్బతింటాయి." అవినీతి అనేది కొమ్మలు కొలవలేని పొడవు కలిగిన చెట్టు; అవి ప్రతిచోటా వ్యాపిస్తాయి; మరియు అక్కడ నుండి పడే మంచు, కొన్ని కుర్చీలు మరియు అధికార బల్లలకు సోకింది." అని సముచితముగా చెప్పబడింది. అందువల్ల, మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

32. ఈ కేసులో ఉన్న విషయాలను బట్టి మొదటి ప్రతివాది పై వచ్చిన ఆరోపణలు ఈ దశలో తేలికగా పక్కన పెట్టలేమని తెలుస్తోంది. ఆదాయపు పన్ను శాఖ అధికారులు, ఇతర అధికారులు, వ్యాపారవేత్తలు, హవాలా వ్యాపారులతో కూడిన వ్యవస్థీకృత సిండికేట్ ఉన్నట్లు తెలుస్తోంది. అటువంటి విషయాలన్ని ఆటంకాలు లేని దర్యాప్తు ద్వారా వెలికితీయాల్సిన అవసరం ఉంది.

33. అవినీతి నిరోధక చట్టము సెక్షన్ 17ఎ కింద తప్పనిసరి చేసిన విధంగా దర్యాప్తుకు ముందస్తు ఆమోదం పొందలేదని, అందువల్ల, ప్రతివాది నంబర్ 1పై ప్రారంభించిన చర్యలు కలుషితం అయ్యాయన్న వాదనకు చట్టపరమైన లేదా వాస్తవిక ఆధారం లేదు. సమర్థ అధికారి యొక్క ముందస్తు ఆమోదం లేకుండా, అధికారిక కృత్యములు లేదా విధులను నిర్వర్తించడంలో చేసిన ఏదైనా సిఫారసు లేదా తీసుకున్న నిర్ణయానికి సంబంధించి ఆరోపించబడిన నేరం ఉన్న చోట, ప్రభుత్వ ఉద్యోగి చేసినట్లుగా ఆరోపించబడిన ఏదైనా నేరంపై పోలీసు అధికారులు ఎటువంటి గుప్తవిచారణ, విచారణ లేదా దర్యాప్తు నిర్వహించరాదని సెక్షన్ 17ఎ కేవలం భావిస్తుంది. ఈ విభాగానికి సంబంధించిన మొదటి వినాయింపు(ప్రొవిసో), అక్రమమైన ప్రతిఫలాన్ని అంగీకరించిన అభియోగం పై అక్కడికక్కడే అరెస్టు చేయబడిన వ్యక్తి కి సంబంధించిన కేసులలో అటువంటి ఆమోదం అవసరం లేదని పేర్కొన్నది.

34. సెక్షన్ 17ఎ యొక్క మొదటి వినాయింపు అనేది ఒక ప్రజా సేవకుడిపై అక్రమ ప్రతిఫలాన్ని లేదా దాని ప్రయత్నము అంగీకరించినందుకు అభియోగాలు మోపబడిన కేసులను సూచిస్తుంది. ట్రాప్ కేసులో అటువంటి అధికారిని దర్యాప్తు చేయడానికి ముందస్తు ఆమోదం లేదా మంజూరు అనేది ట్రాప్ మరియు దర్యాప్తు యొక్క ఉద్దేశ్యాన్ని భంగపరిచే అవకాశం ఉంది, ఇది శాసన మండలి యొక్క అంతర్లీన ఉద్దేశ్యం కాదు. లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మొదటి ప్రతివాదిపై దర్యాప్తునకు కేంద్ర ప్రభుత్వం నుండి ముందస్తు ఆమోదం అవసరం లేదు. అంతే

కాకుండా, మొదటి ప్రతివాది పై ఉన్న నిందారోపణ, అతని న్యాయపరమైన లేదా పరిపాలక హోదాలో అతను చేసిన ఏవైనా సిఫార్సులు లేదా తీసుకున్న నిర్ణయాల చుట్టూ తిరగదు.

35. జామీను రద్దు అనేది ఖచ్చితమైన మరియు విపరీతమైన కారణాల వల్ల మాత్రమే జరగాలి అనేది నిజం.ఏదేమైనా, జామీను మంజూరు చేసే న్యాయబద్ధం కాని ఉత్తర్వును పక్కన పెట్టడం అనేది జామీను రద్దు చేయడానికి భిన్నంగా ఉంటుంది. న్యాయ నిబంధనానుసారంగాను వివేచనానుసారము గాను జామీను మంజూరు చేసే హై కోర్ట్ న్యాయ పరిధిలో ఈ కోర్టు ఎప్పుడూ జోక్యం చేసుకోదు. నిందితునికి జామీను మంజూరు చేసే విషయం లో హైకోర్టు తన వివేచనను న్యాయంగా, జాగ్రత్తగా మరియు ఖచ్చితంగాను ఇంకా ఈ కోర్టు ఎప్పటికప్పుడు నిర్దేశించిన ప్రాథమిక సూత్రాలకు అనుగుణంగాను తన న్యాయ పరిధిని అమలు చేసినదా అని మాత్రమే నిర్ధారణ చేసుకోవాలి.

**36. సుశీలా అగర్వాల్ (పైన పేర్కొన్న) కేసులో రాజ్యాంగ ధర్మాసనం క్రింది విధంగా పేర్కొంది:**

> " 92.11.జామీను మంజూరు చేసే ఉత్తర్వు యొక్క ఖచ్చితత్వాన్ని, ప్రభుత్వం లేదా దర్యాప్తు సంస్థ తరపున అప్పీలేట్ లేదా ఉన్నత న్యాయస్థానం పరిశీలన చేసి మరియు దానిని మంజూరు చేసే న్యాయస్థానం భౌతిక వాస్తవాలను లేదా కీలకమైన పరిస్థితులను పరిగణనలోకి తీసుకోని పరిస్థితిలో ఆ ఉత్తర్వును పక్కన పెట్టవచ్చు."

## సారాంశం

37. ఆరోపణల స్వభావం, రికార్డులో ఉన్న అంశాలు, ముందస్తు జామీను మంజూరుపై స్థిరపరచబడిన చట్టపరమైన సూత్రాలను పరిగణనలోకి తీసుకున్న తరువాత, హైకోర్టు, సిఆర్పిసి సెక్షన్ 438 కింద తన విచక్షణాధికార పరిధిని వినియోగించుకుని మొదటి ప్రతివాది కి అరెస్టుకు వ్యతిరేకంగా రక్షణను కల్పించకుండా ఉండి ఉండాల్సిందని మేము అభిప్రాయపడుతున్నాము.

38. ఎసిబి (రాష్ట్ర పోలీసులు) చర్యలు అన్య కారణాలతో అమలు చేయబడ్డాయని మొదటి ప్రతివాది కి కొన్ని చెల్లుబాటు అయ్యే ఒప్పుకోదగిన అనుమానాలు ఉన్నాయని భావిస్తే, దర్యాప్తు సిబిఐకి బదిలీ చేయబడినది కనుక ఆయన ఇకపై అలా చెప్పలేరు. సెంట్రల్ ఏజెన్సీకి వ్యతిరేకంగా వ్యక్తిగత ప్రతీకారం, బాధించడం, పక్షపాతం లేదా ఇతర ఉద్దేశ్యాల ఆరోపణలు మేము ఎక్కడా

గమనించలేదు. ఏదేమైనా, నిర్బంధ విచారణకు లోబడి ఉన్న నిందితుడి హక్కులను నమ్మకంగా పాటిస్తూ స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన, నిష్పక్షపాతమైన దర్యాప్తును సిబిఐ నిర్వహించాలని భావిస్తున్నాము.

39. తదనుగుణంగా, అప్పీళ్లు అనుమతించడమైనది. 2022 , డిసెంబర్ 19, నాటి హైకోర్టు వివాదాస్పద తీర్పు మరియు ఉత్తర్వులను త్రోసిపుచ్చి , మొదటి ప్రతివాది ముందస్తు జామీను దరఖాస్తును కొట్టివేయదమైనది. దాని పర్యవసానంగా, రిమాండ్ కోసం సిబిఐ దరఖాస్తును పాక్షికంగా అనుమతించిన ప్రత్యేక న్యాయమూర్తి/సిబిఐ కోర్టు నంబర్ 3 ఆమోదించిన 22.12.2022 నాటి ఉత్తర్వును కూడా త్రోసిపుచ్చడమైనది.

40. ముందస్తు అరెస్టును తిరస్కరించడం లేదా ఇవ్వడం అనే పరిమిత ప్రయోజనం కోసం మాత్రమే ఈ కోర్టు ఈ కేసులోని ఆరోపణల యోగ్యతలపై ప్రాథమిక అభిప్రాయాన్ని వ్యక్తం చేసిందని మేము స్పష్టం చేస్తున్నాము.

మొదటి ప్రతివాది తగు విధముగా న్యాయస్థానం ముందు రెగ్యులర్ జామీను కోసము దరఖాస్తును దాఖలు చేస్తే, అది దాని స్వంత యోగ్యతలపై మరియు చట్టానికి అనుగుణంగా పరిగణించబడవలేను, కానీ ఇక్కడ పేర్కొన్న పరిశీలనల ద్వారా ప్రభావితం కారాదు.

**41. ఈ అప్పీళ్లు పైన పేర్కొన్న నిబంధనల ప్రకారం పరిష్కరించబడినాయి.**

**42. పెండింగ్లో ఉన్న దరఖాస్తులు ఏవైనా ఉంటే, అవి కూడా పరిష్కరించబడినవి.**

**........న్యాయమూర్తి.**

**(సూర్య కాంత్)**

**........ న్యాయమూర్తి.**

**(జె. కె. మహేశ్వరి)**

**న్యూ ఢిల్లీ;**

**ఏప్రిల్ 17,2023.**